క్లుప్తంగా

అర్హులకు ఇళ్లు ఇప్పించరూ



అమరచింత: అర్హత ఉన్న దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఎందుకు చేయడం లేదని ఏఐవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. పట్టణంలోని 8 వ వార్డుకు చెందిన దివ్యాంగులు ఆలియా, కిషన్ దంపతులను శుక్రవారం కలిసి వారు నివసిస్తున్న మట్టి ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారులకు దివ్యాంగులు నివేదించారని, అన్ని అర్హతలున్న వీరిని కాదని ఇతరులకు మంజూరు చేయడం ఏమిటన్నారు. అధికారులు స్పందించి ఇళ్లను మంజూరు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



పాన్‌గల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే రోగాలకు దూరంగా ఉండొచ్చని డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. ప్రైడే డ్రైడేలో భాగంగా జమ్మాపూర్, దొండాయిపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంచందర్, సతీష్, రమాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా కోలుకోవాలి

చిన్నంబావి: మండలంలోని కాలురు గ్రామానికి చెందిన శ్రీశైలం నిర్వాసితుల సంఘం నాయకుడు నారాయణరెడ్డి ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం కోలుకోవడంతో ఆయనను శ్రీశైలం నిర్వాసితులు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాగోజి, గోవిందు, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, మద్దిలేటి, ఉస్సేన్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

వీపనగండ్ల: మండలంలోని ఎరువుల విక్రయదారులు యూరియా అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని మండల వ్యవసాయఅధికారి డాకేశ్వర్‌గౌడ్ ఎరువుల దుకాణ దారులను హెచ్చరించారు. శుక్రవారం కల్వరాల్ల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం నిబంధనలను అతిక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అమరచింత: పట్టణంలోని 4వ వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మాజీ కౌన్సిలర్ సింధు మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ వార్డులో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. సమస్యను త్వరితగతిగా పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ఆత్మకూర్: పట్టణ ప్రజలు పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలసి డ్రైడే ఫ్రైడేలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యూకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్ ఉన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

వనపర్తిటౌన్: 100 రోజుల కార్యాచరణలో భాగంగా పురవీధుల్లో తడి, పొడి వ్యర్థాల విభజనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

మచ్చ లేని నాయకుడు ప్రధాని మోదీ..

వనపర్తి టౌన్ : అవినీతి మచ్చ లేకుండా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ 11 ఏళ్లుగా పాలన సాగిస్తున్నారని.. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని 24వ వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పురపాలికకు కేంద్రం భారీగా నిధులు మంజూరు చేసిందని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవన నిర్మాణాలు అవే నిధులతో చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుమలేష్, శ్రీనివాస్‌గౌడ్, సూగూరు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు



తూంకుంట వాగులో కూల్చిన హైడ్రాలిక్ స్ట్రక్చర్

- హైడ్రాలిక్ స్ట్రక్చర్‌ను కూల్చివేసిన కాంట్రాక్టర్
- భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతన్న ఆందోళన
- చెక్‌డ్యాంలు నిర్మించాలని విన్నవించినా స్పందించని అధికారులు

వీపనగండ్ల: రైతుల ప్రయోజనాల కోసం రూ.లక్షలు ఖర్చుచేసి సాగునీటి సరఫరా చేయిస్తామని చెబుతున్న ప్రభుత్వం, అధికారులు తూముకుంట గ్రామ సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంను కూల్చివేసిన తప్పించుకొనకపోగా రెండేళ్ల క్రితం శిలాఫలకాలు వేసి వదిలివేయడంతో భూగర్భజలాలు తగ్గిపోయి రైతుల పంటలకు సరైన సాగునీరు అందకపోవడంతో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు.

హైడ్రాలిక్ స్ట్రక్చర్ కూల్చేశారు..

తూముకుంట సమీపంలోని ప్రధానవాగులో గతంలో హైడ్రాలిక్ స్ట్రక్చర్‌ను నిర్మించారు. జాలుబావి తండా రోడ్డుకు వెళ్లేందుకు ఇంజినీరింగ్ అధికారులు సీఆర్ఆర్ నిధుల ద్వారా బ్రిడ్జిని నిర్మించేందుకు అనువుగా ఉండాలన్న కారణంచే హైడ్రాలిక్ స్ట్రక్చర్‌ను కూల్చేశారు. ఆ సమయంలో రైతులు కాంట్రాక్టర్‌ను నిలదీయగా అధికమొత్తంలో నీరు నిల్వ ఉండడం వల్ల బ్రిడ్జి నిర్మాణం సాగడం లేదని పనులు పూర్తైన వెంటనే స్ట్రక్చర్‌ను నిర్మిస్తామని



వల్లభాపురం గ్రామ సమీపంలో దర్శనమిస్తున్న శిలాఫలకం

హామీ ఇచ్చి నిర్మించకుండా వెళ్లిపోయారు. దీంతో వాగులో నిల్వ ఉండాల్సిన నీరు కిందికి వెళ్తుందని రైతులు వాపోతున్నారు. గతంలో నిల్వ నీటితో 100 మోటర్లతో 300 ఎకరాలకు సాగునీరు వస్తుండేదని రైతులు వాపోతున్నారు.

రెండేళ్లుగా శిలాఫలకాలు దర్శనం..

ఇదే వాగుకు పై ఎగువ భాగంలో బోడగట్టు దగ్గర పెద్దవాగు కత్వా పునర్నిర్మాణం కోసం, సామర్థ్యం పెంపునకు 2023 సంవత్సరం అక్టోబర్ లో అప్పటి ఎమ్మెల్యే, పలువురు అధికారులు దాదాపు రూ.4కోట్లతో పనులు పూర్తిచేసి నీరునిల్వ ఉండేలా చేస్తామని శిలాఫలకాన్ని వేసి వదిలేశారు. అలాగే తూముకుంట సమీపంలో రూ.7.23కోట్లతో చెక్ డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాని నేటికీ నిధులు మంజూరు కాక పనులను ప్రారంభించలేదని తూముకుంట, బొల్లారం, వల్లభాపురం, నాగర్లబండతండా రైతులు వాపోతున్నారు.

నీరు వృథా అవుతున్నాయి..



హైడ్రాలిక్ స్ట్రక్చర్‌ను కాంట్రాక్టర్ కూల్చేయడంతో వాగులోని నీరు కిందికి వృథాగా పోతున్నాయి. నీరు నిల్వ ఉండకుండా పోవడంతో రైతులు నానా ఇబ్బందులకు గుర వుతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి స్ట్రక్చర్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయించాలి.

– బోరెల్లి కురుమయ్య, రైతు, తూముకుంట

ప్రత్యేక నిధులు కేటాయించాలి



వల్లభాపురం, బొల్లారం , తూముకుంట గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మాణం కోసం గతంలో శిలాఫలకాలు వేసిన వాటికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. అధికారులు నిర్ధారించిన చెక్‌డ్యాంలు పూర్తిస్థాయిలో నిర్మిస్తే వందల ఎకరాల్లో పంటలు పండించేందుకు సులువవుతోంది.


– మండ్ల నిరంజన్, రైతు, తూముకుంట

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

స్ట్రక్చర్‌కూల్చివేత జెండర్ల నిర్మాణాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆయా శాఖల అధికారులకు అవసరమైన నివేదికలు పంపిస్తాం. వివిధ శాఖల ఉన్నతాధికారులు రైతుల అభిప్రాయాలు తీసుకొని నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు పంపించాలని పై అధికారులకు విజ్ఞప్తి చేస్తాం.

– శ్రీకాంత్, జేఈ జూరాల సబ్ డివిజన్, పెబ్బేరు

దంచి కొట్టిన వర్షం



అలుగు పారుతున్న గోపల్‌దిన్నె రిజర్వాయర్



భీమా కాల్వనుంచి పారుతున్న వర్షపు నీరు

వీపనగండ్ల: మండలంలో గురువారం రాత్రి భారీగా వర్షం కురువడంతో వాగులు వంకలు, చెరువులు నిండి అలుగులు పారాయి. గోపల్‌దిన్నె రిజర్వాయర్ అలుగు పారడంతో గోవర్ధనగిరి గ్రామ సమీపంలోని కత్వాలో ఉదయం వేళ వాహనాలు వెళ్లేందుకు వీలు పడలేదు. లోతట్టు రోడ్డును మరమ్మతు చేయాలని విన్నవించిన అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే వీపనగండ్ల గ్రామ ఊరుచెరువు సమీపంలో భీమా కాల్వ 30వ కిలో మీటర్ వద్ద కాల్వ నుంచి పంట పొలాలకు నీరు చేరుతుండడంతో భీమా కాల్వ తెగిపోయే పరిస్థితులు నెలకొంటాయని అధికారులు ముందస్తుగా కాల్వను పరిశీలించి అవసరమైనచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నైట్‌హాల్ట్ బస్సులు నడపాలని ధర్నా



మాట్లాడుతున్న అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి గతంలో మాదిరిగా నైటాల్ట్ బస్సులు నడపాలని గ్రామస్తులు, నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. మండల మాజీ జెడ్పీటీసీ సామ్యనాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్యలతో పాటుగా పలు పార్టీల నాయకులు, గ్రామప్రజలు బస్టాండ్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 30ఏళ్లుగా మండలకేంద్రంలో రాత్రి రెండు బస్సులు నిలిపేవారని చెప్పారు. ఉదయం ఒక బస్సు మహబూబ్‌నగర్, ఒకటి వనపర్తికి వెళ్లేదన్నారు. ఇటీవల ఎందుకో తెలియదుగాని రాత్రి బస్సులు నైటాల్ట్ ఉండటం లేదన్నారు. ఉదయాన్నే ఎక్కడికైనా వెళ్లాలంటే వనపర్తి నుంచి బస్సువచ్చే వరకు అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ఉదయం వనపర్తి నుంచి వచ్చేబస్సు మహబూబ్‌నగర్ వెళ్లి తిరిగి ఖిల్లాఘనపురం వచ్చే వరకు ఎదురు చూస్తూ ఉండాల్సి వస్తుందన్నారు. గతంలో మాదిరిగా రాత్రి బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్ విషయం తెలుసుకుని నాయకులు, గ్రామస్తులతో ఫోన్‌ద్వారా మా ట్లాడారు. బుధవారం నుంచి యథావిధిగా నైటాల్ట్ బస్సులు నడిపించడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కళాశాలలో రాఖీ సంబరాలు



కళాశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాఖీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండల ఆర్ఎస్ఎస్ శాఖ ద్వారా మండల ప్రముఖ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భాస్కర్ తెలిపారు. విద్యార్థులు అందరు కలిసికట్టుగా రాఖీ కట్టుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరాలి



నర్సింగాపురంలో బీజేపీ ఇంటింటా ప్రచారం

మదనాపురం: మండలంలోని నర్సింగాపూర్‌లో శుక్రవారం బీజేపీ అధిష్టానం పిలుపుమేరకు పీఎం నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న కేంద్రప్రభుత్వ పథకాల గురించి ఇంటింటా ప ర్యటించి ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ప్రజలు మద్దతు పలకాలని కోరారు. నాయకులు కృష్ణాయాదవ్, బీజేవైఎం నాయకులు బిట్లిరాజశేఖర్, వెంకటేశ్వర్లశెట్టి, కావలిశివ, నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: దేశంకోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలను స్మరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విభజన గాయాల స్మృతిదినం, హర్‌గర్ తిరంగా యాత్రలపై మండల స్థాయి కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా హాజరై ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 12న ఖిల్లాఘనపురంలో జరిగే తిరంగా ర్యాలీలో అందరు పాల్గొన్నారు. 13వ నుంచి 15వ తేదీ లోపల ప్రతిఇంటిపై త్రివర్ణ పతాకం ఎగుర వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్ విక్రం రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న, యువమోర్చా అధ్యక్షుడు గోపి ముదిరాజ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రాంచందర్ పాల్గొన్నారు.

బిహార్‌లో తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చాలి



వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: బిహార్ ఓటర్లను మళ్లీ తిరిగి చేర్చాలని శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, డి కురుమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో గట్టయ్య, జి బాలస్వామి, రమేష్ పాల్గొన్నారు.

కొత్తకోట: బిహార్‌లో ఓట్ల తొలగింపును వ్యతిరేకిస్తూ పట్టణంలో చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నిక్సన్ మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటయ్య, కురుమన్న పాల్గొన్నారు.

మదనాపురం: బిహార్ ఎన్నికల ఓట్ల అవకతవకలపై శుక్రవారం సీపీఎం మండలం పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర నిరసన తెలిపారు. మండల కార్యదర్శి వెంకట్ రాములు కార్యక్రమంలో చిరంజీవి, మాసన్న, సత్యనారాయణ, గోపాల్, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: బిహార్ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్యానాయక్ గొర్రెల కాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు దేవేందర్, వెంకటయ్య, భీమయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో యువతీ అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. గోపాల్‌పేట మండలానికి చెందిన సరిత (18) జిల్లా కేంద్రంలో మేనత్త ఇంట్లో ఉంటుంది. శుక్రవారం ఉదయం లేచి గదిలో చూడగా కనిపించకపోవడంతో చుట్టుప్రక్కల స్నేహితులు, బంధువుల దగ్గర వెతికినా ఆమె ఆ టచూకీ లభించలేదు. ఆమె తల్లి ముడావత్ మంగమ్మ ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో చోరీ

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో అర్బన్‌హెల్త్ సెంటర్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో టీచర్స్ కాలనీలోని అర్బన్‌హెల్త్ సెంటర్ తాళాలు పగులగొట్టి రూ.45 విలువ టీవీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. హెల్త్‌సెంటర్ నిర్వాహకురాలు విజయలక్ష్మి ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

వనపర్తి రూరల్: నాగవరం గ్రామానికి చెందిన వ్యాసని జయమ్మ మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందిందని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగవరం గ్రామంకు చెందిన వ్యాసని జయమ్మ (54) ఈ నెల 1న ఉదయం ఇంట్లో కట్టెల పొయ్యి దగ్గర వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకొంగు పొయిలో పడి మంటలు రావడంతో కుటుంబ సభ్యులు మంటలార్పారు. కాలిన గాయాలతో ఉన్న ఆమెను జిల్లాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి కుమారుడు జయన్న శుక్రవారం రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: భార్యను కొట్టి గాయపర్చిన భర్తపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అయన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన ఫకీర్ తాహేర్, ఫకీర్ అఫ్రోజ్ భార్యాభర్తల మధ్య తరచుగా కుటుంబం విషయంలో గొడవలు జరుగుతుండేవి. గురువారం రోజున ఓ కిరాణం దగ్గరకు వెళ్లి వస్తున్న భార్యను అడ్డగించిన భర్త అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటుగా కట్టెతో తలపై కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు రక్తగాయాలైనాయి. ఈ విషయమై బాధితురాలి తల్లి ఫకీరు కాసింబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఆమెకు వనపర్తి జిల్లా ఆస్పత్రిలో వైద్యం చేయించినట్లు ఆయన తెలిపారు.


బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యం

ఆత్మకూర్: పుట్టినబిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ, డాక్టర్ వసంత, సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శుక్రవారం పట్టణంలో అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, రఫీఖాబాను పాల్గొన్నారు.

పోరాట యోధుడు పండుగ సాయన్న



కొత్తకోటలో పాల్గొన్న ముదిరాజ్‌లు



మదనాపురంలో..

కొత్తకోట: మండలకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

మదనాపురం: పండుగసాయన్న జయంతిని ముదిరాజ్‌లు గ్రంథాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళర్పించారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పేదల పెన్నిధి పండుగసాయన్న అని జిల్లా మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు సాయిలు, మాజీ జెడ్పీటీసీ సామ్యనాయక్, విండోవైస్‌చైర్మన్ క్యామరాజు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, ప్రకాష్‌లు అన్నారు. కమాలొద్దీన్‌పూర్, షాపురం గ్రామాల్లో సాయన్న జయంతి నిర్వహించారు.




ఖిల్లాఘనపురంలో..

ఆత్మకూర్: పండుగ సాయన్న జయంతిని పట్టణంలో మత్స్య సహకారసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీచౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, విజయ్‌కుమార్, వెంకటన్న తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లో..

మార్కెట్ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న చైర్మన్ రహ్మతుల్లా

ఆత్మకూర్: మార్కెట్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తామని కమిటీ చైర్మన్ ఎండీ రహ్మతుల్లా, వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులో పాలకమండలి మొదటి సమావేశాన్ని కార్యదర్శి శ్రీనివాసులు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మంత్రి శ్రీహరి సహకారంతో మార్కెట్ కొత్తభవనం, మర్చంట్ భవననిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, నరేష్, మణెమ్మ పాల్గొన్నారు.

వరలక్ష్మీ.. వరములు ఇవ్వమ్మా



పెబ్బేరు లలితా త్రిపురసుందరి దేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

అమరచింత: శ్రావణమాసంలో నిర్వహించుకునే వరలక్ష్మీవత్రంను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇళ్లలో వత్రాలను నిర్వహించుకుని తమ సౌభాగ్యం కాపాడాలంటూ అమ్మవారిని మొక్కుకుంటూ వివాహిత మహిళలకు పసుపు, కుంకుమలతో పాటు వాయినంను అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో సామూహికంగా వరలక్ష్మి వ్రతంను జరుపుకొన్నారు.

వనపర్తి రూరల్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని అయప్ప స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన లలితా త్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతమ హోత్సవంను మహిళలు ఘనంగా నిర్వహించారు. శ్రీ రంగాపురంలో శ్రీరంగనాయక స్వామి ఆలయంలో మహిళలు వరలక్ష్మి వ్రతం మహిళలు ఘనంగా జరుపుకొన్నారు.



శ్రీరంగాపురం రంగనాయకస్వామి ఆలయంలో



అమరచింత శిశుమందిరంలో..